



సావిత్రికి మొన్న మొన్నటి వరకూ ఓ దురభిప్రాయం వుండేది. పూజా పునస్కారాలనేవి వయసు మళ్ళిన వాళ్ళు మాత్రమే చెయ్యాలని.

# పూజ

అనూరాధ



కానీ ఈమధ్య శరపరంపరలా వచ్చి పడుతున్న సినిమాలు చూశాక ఆ పిల్ల అభిప్రాయం మారిపోయింది. అంతేకాదు అసలు వయసులో వున్నవాళ్ళు చేస్తేనే పూజలు కన్నుల పైకుంఠంగా వుంటాయని కనిపెట్టింది కూడాను. అందులోనూ 'నోము' సినిమా చూసి ఆ అమ్మాయి మరీ ఇంప్రెస్ అయిపోయింది. "ఛఛ పూజలు చేసుకోని, నోములు నోచుకోని భారతనారి బతుకుకూడా ఒక బతుకేనా- అందులోనూ భక్తురాలికి అంత కోవరేషన్ ఇచ్చే దేవుడున్నప్పుడు" అని తెగ బాధపడింది దీనికి సాయం ఆ అమ్మాయి అభిమాన రచయిత్రి యనమండ్ర కైకాదేవి రాసిన "మేలుకో శ్రీనివాసా" అనే బృహన్నవల కూడా అప్పుడే మార్కెట్లోకి వచ్చింది. అందులో హీరోయిన్‌కి దారుణమైన దైవ భక్తి. ఆవిడ మొగుడు పరమ నాస్తికుడు. ఇంట్లో ఎక్కడా దేవుడి పాస్‌పోర్ట్ సైజు ఫొటో వుండడానిక్కూడా వల్లకాదంటాడు అలాంటి కిరాతకుణ్ని హీరోయిన్ తన చాకచక్యంతో మార్చేసి తిరుపతికి తీసుకుపోతుంది.

ఈ నవల చదివాక సావిత్రి మరీ భక్తురాలై పోయింది. కానీ సాహసించి పూజలు మాత్రం మొదలు పెట్టలేక పోయింది. మరి తండ్రి తనకి పెళ్ళి సమ్బంధాలు చూస్తున్నాడుకదా యిలాంటప్పుడు తను కొత్తగా నోములూ, వ్రతాలూ మొదలెడితే యింకేమన్నా వుందా? యింటా, బయటా అన్నదమ్ములూ, స్నేహితులూ తనని నిలవనిస్తారు. అందుకని అంతటి భక్తి ప్రపత్తుల్ని మనసులోనే అణిచేసుకుంది. పోనీ వీణవాయిస్తూ కృష్ణుడిపాట ఒకటి పెళ్ళి చూపుల్లో పాడాలని ఎంతో వుబలాట పడ్డది. కానీ తనకి వీణా లేదు పాటా రాదు. ఈ మథనం యిలా సాగుతుంగానే సావిత్రికి పెళ్ళి అయింది. అత్తవారింటికి వెళ్ళనూవెళ్ళింది దాంతో తన సమస్య మబ్బులా విడిపోయినట్టే తోచింది సావిత్రికి.

వాణిశ్రీలానో, విజయనిర్మలలానో అలంకరించుకొని "కౌసల్యా సుప్రజా రామా" అనో- "లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం" అనో తను పాడుతుండగా భర్త శోభన్‌బాబులానో, కృష్ణలానో నిద్రలేవడం —

అతను స్నానం చేసి వస్తుంటే తను హారతి పళ్ళెం పట్టుకు ఎదురువెళ్ళడం - అతను హారతి కళ్ళ కదుకోగానే తను అతని నోటో ప్రసాదం పెట్టడం, అతను తనని దగ్గరకు తీసుకోవడం- ఇలా బోల్డన్ని సీనులు రెడీ చేసి పెట్టుకుంది. కానీ సుబ్రహ్మణ్యం- అదే సావిత్రి మొగుడు పడనివ్వలేదు.

సరిగ్గా పది నిమిషాల తక్కువ ఏడింటికి "సావిత్రీ- పాలొచ్చాయా" అని బద్ధకంగా కేకేసి, వచ్చాయంటేనే మంచం దిగుతాడు. మొహం కడుక్కుంటూనే "పేపరొచ్చిందా" అని కంగారు పడిపోతాడు. కాఫీ తాగుతూ, పేపరు చదువుతూ, వార్తలు వింటూ, గడ్డం చేసుకుంటూ, మళ్ళా వార్తలు వింటూ, కాఫీ తాగుతూ, వివిధభారతి వింటూ-'ఈ రకం మనిషితో ఏం పూజలు చేసుకోవడమో' అని నిస్పృహలో పడిపోయింది సావిత్రి. కైకాదేవి నవలలో హీరోయిన్ యిలాంటప్పుడు ఏం చేసిందా అన్న ఆలోచనలో పడింది. ఆ ఆలోచన తెగకుండానే సావిత్రికి నెల తప్పింది. మామిడికాయలూ, మాత్రలూ, నీరసం, అలసట. ఇంకెక్కడిపూజ! అలా ఒకటికాదు రెండుకాదు. మూడుసార్లయింది.

అప్పటికి సావిత్రికి జుట్టు పల్చబడింది నడుం చిక్కబడింది. కానీ పూజ సరదా మాత్రం అలాగే వుంది. చెక్కు చెదరకుండా. చెయ్యడానికి చెయ్యి వీలవదు. మానడానికి మనసొప్పుకోదు. ఇంతలో 'అమెరికా అమ్మాయి' సినిమా వచ్చింది. పోతన, (వేమనో గుర్తులేదు) సినిమా చూసిన బాలయోగిలా అయిపోయింది సావిత్రి. 'అమెరికా అమ్మాయి' దేవాలయంలో గోత్రం చెప్పి పూజ చేయించే సీను చూసి మరీ యిదై పోయింది. "ఇన్నాళ్లూ భారతీయ సంస్కృతినీ, నాగరికతనీ మర్చిపోయి పూజలు చేయడం మానేసి ఎంత పొరపాటు చేసింది! పిల్లల్ని కనిపెంచుతూ, మొగుడికి అన్నీ అమరుస్తూ ఎంత మాయలోపడిపోయింది. తన పాపానికి నిష్కృతివుందా!" అని ఎడతెగకుండా పశ్చాత్తాపపడింది. సుబ్రహ్మణ్యానికికూడా సినిమా నచ్చిందికానీ ఒకటే లోటు కనపడింది. హాలులోంచి యివతలకి వచ్చాక సిగరెట్టు వెలిగించుకుని అదే అన్నాడు భార్యతో "అంతా బానేవుందికాని సావిత్రీ, శ్రీధరూ, ఆ అమ్మాయీ, (హీరోయిన్ పేరు నోరు తిరగదుగా) పీటలమీద కూచుని సత్యన్నారాయణవ్రతం చేసినట్టు చూపిస్తే ఇంకా బావుండేదోయ్." అని

ఏమైతేనేం 'అమెరికా అమ్మాయి' మంచి ఎఫెక్టిచ్చింది. మొదట్లో సావిత్రి అద్దంలో


చూసుకు సందేహించిందికానీ మళ్ళీ సర్దు కుంది. "ఫోన్లే దేవికలానో. జమునలానో వున్నాకదా. ఇప్పుడు— ఏంచేస్తాం" అని. అంతే! విజృంభించింది. పిల్లలకి, సుబ్రహ్మణ్యానికీ ఎంత ఇబ్బంది అయినా సరే పూజ మానకూడదు అనుకుంది. తను పూజలో వుండగా పై పని చూసేందుకు ఓ పనిపిల్లని పెట్టుకుంది. పూజకి పువ్వులు కావాలి కదా. అందుకని నెలకి అయిదు రూపాయిలిచ్చి పువ్వుల వాడిని కుదుర్చుకొంది.

ఈసారి సావిత్రి పూజకేం విఘ్నం రాలేదుగానీ ఓ సందేహం మాత్రం పట్టుకుంది. "పనిపిల్ల గాస్ ఆఫ్ చేసిందో లేదో కాఫీ కలుపుకు తాగేస్తోందేమో. నానిగాడు బాయిలర్ తిప్పలేదు కద— ఆయన విడిచిన బనీనే వేసేసుకున్నారేమో. పువ్వులు మరీ తక్కువ కట్టాడు" — ఇలా మనసు పరిపరివిధాల పోతూ వుంటుందికదా పూజ చేస్తున్నంతసేపూ-అలా పోకుండా వుండాలంటే పూజారిణి ఏం చెయ్యాలిఅని. ఓ రోజు పూజలో కూచుని యిలా ఆలోచిస్తూ 'పూజ సినిమాలో వాణీ జయరాం పాడిన పాట వింటూ, ఆ సీనులో వాణిశ్రీ నటన గుర్తు తెచ్చుకుని ఆనందిస్తూ—మనసు సరిపెట్టుకుంటుంటే నానిగాడు రేడియో బర్‌మని తిప్పేశాడు. "కృష్ణా. మనవడివె" అంటూ భానుమతి వొచ్చేసింది. సావిత్రి మనస్సులో మెరుపు మెరిసింది. "అంతే. ఇంక భానుమతిలా అయ్యాకే పూజ చేసుకునే భాగ్యం" అని నిట్టూర్చింది.

—అనూరాధ

---

# విలువ



"ఏయ్ రిక్షా! ఊర్వశి టాకీస్‌కి వస్తావా ?"

"వస్తానమ్మగోరూ."

"ఎంతిమ్మంటావ్ ?"

'రూపాయిన్నరిప్పించండమ్మా.'

"రూపాయిన్నరా!.... ఏం రానూ పోనూ అనుకున్నావా? మాదీ ఈ ఊరే. పొరుగూరువాళ్ళం అనుకున్నావేమి?"

"అదేంటమ్మగోరూ. అలాగంటరు? ధరలు ఎలా మండిపోతున్నాయో మీకు తెలీదేంటమ్మా?.... ఉన్నోళ్ళరు మీరు అలాగంటే మాబోటి పేదోళ్ళగతి ఎవరు చూస్తారండమ్మ?"

"సరేలేవయ్యా.... ధరలువంక చెప్పుకుని ప్రతి ఒక్కడూ తనరేటు పెంచేసున్నాడు. మొన్నటిదాక. ముప్పావలాకి వచ్చేరిక్షా. ఇప్పుడు రూపాయిన్నర అడగటానికి న్యాయం ఉండవసరంలేదా?" అంటూ, మరో రిక్షా ఆ దరిదాపుల్లో లేకపోవటంతో ఏం చేయటమా అని ఆలోచిస్తూ నుంచుంది సుజాత.

నాకు రిక్షావాడు అడిగిన బేరంలో "రీజనబులిటీ" ఉందనిపించింది. ఎప్పుడో పది రూపాయలు పెడ్తే బస్తా బియ్యం వచ్చాయంటే....ఇప్పుడూ అలానే కావాలంటే వస్తాయా? మనదేశంలో పెరుగుతున్న జనాభాతోపాటు-పేదరికం. నిత్యావసర వసువుల ధరలు. అలాగే వ్యక్తుల ఆదాయమూ పెరుగుతూనే వున్నాయి. కానీ ఉత్పత్తి పెరగందే. ఆదాయం పెరిగి మాత్రం ఏం సుఖం? అందుకే అప్పుడెప్పుడో పావలాకి వచ్చే సరుకులు ఇప్పుడు పది పావలాలు ఖర్చుపెడ్తే కాని కొనలేకుండా వున్నాము. అంతేనా. డబ్బున్నవాడి దగ్గర మరింత డబ్బు పేరుకుంటూనే వుంది. అటు పేదోడు గంజినీళ్ళు త్రాగి బ్రతుకుతున్నాడు. ఇటు ధనికుడు పంచభక్ష్యపరమాన్నాలు భుజిస్తున్నాడు. ఈ రెండు వర్గాలకు చెందని మధ్య తరగతి కుటుంబీకుడే పచ్చిమంచి నీళ్ళకు కూడా నోచుకోని పరిస్థితి

పినిశెట్టి శ్రీనివాసరావు

ఏర్పడింది. ఏవిటో ఇవన్నీ ఆలోచిస్తుంటే మనసు అదోలా అయిపోతోంది నాకు. ఇంక ఆలోచనలకు స్వస్తి చెప్పి "సరేలే సుజాతా పద రిక్షా ఎక్కు. ఉన్న ఈ ఒక్క రిక్షా కూడా పోయిందంటే సినిమా టిక్కెట్లు దొరకవు" అన్నాను.

రిక్షా హాలుదాకా వెళ్ళేంతవరకు సుజాత నన్ను సాధిస్తూనే వుంది.

"మీకు బేరాలు ఆడటం చేతకాదండి. మొన్ననొకరోజు యిలాగే కోటగుమ్మం దగ్గర్నుంచి ముప్పై పైసలు ఇస్తే వచ్చే రిక్షాకి. ముప్పావలా ఇచ్చావండి. అసలు మీకు డబ్బు విలువ తెలియదండి. మనం డబ్బులు యెక్కువయిస్తే. ఈ రిక్షావాళ్ళను మనమే పరోక్షంగా పాడుచేస్తున్నామండి. ఎందుకంటే ఈ డబ్బులుపెట్టి. వాళ్ళు త్రాగుడు. జూదం. బ్రాకెట్ మొదలగు వాటికి దుర్వినియోగం చేస్తారట.

సుజాత డబ్బులు యెక్కువ యివ్వననటానికి యిన్ని కారణాలు వున్నాయా వాటి వెనుక? సుజాతకు యింత ఆలోచనాశక్తి వుందా? నాకు ఆశ్చర్యం వేసింది.

సినిమాహాలు వచ్చింది. రిక్షావాడికి డబ్బులిచ్చి. టిక్కెట్లు తీసుకుందాం అని కౌంటర్ దగ్గరకు వచ్చేసరికి 'హౌస్‌ఫుల్' బోర్డు కనపడింది.

"ఇప్పుడేం చేయటం? మరో సినిమాకి ట్రై చేద్దామా?" అన్నాను.

---

